## ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?



గుంతల మయంగా మారిన ఆగ పెల్లి రహదారిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల జూన్ 16 : గుంతలమయంగా మారిన రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా అని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. సోమవారం బీఆర్ఎస్ జాపాల గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆగపెల్లి నుంచి జాపాల వరకు ఉన్న ఐదు కిలో మీటర్ల రోడ్డును వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్ల అభివృద్ధికి రూ.3.75కోట్ల నిధులు కేటాయించినా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గుంతలు, కంకర తేలిన రోడ్డుపై నిత్యం వాహనదారులు ఇక్కట్లు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయించని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పుడుతల నాగరాజ్, ప్రధాన కార్యదర్శి సంజీవ, నాయకులు బకున చంద్రకాంత్. బీఎన్ సతీశ్, మంచాల రాజు, యాట రఘుపతి, పవన్ కుమార్, అన్నారం బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా..

కడ్తాల్, జూన్ 16 : నియోజకవర్గ పరిధిలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉప్పల వెంకటేశ్ సోమవారం మధ్యాహ్నం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు జ్యోతయ్య, గోపాల్‌నాయక్, నాయకులు రమేశ్, సత్యనారాయణ, గణేశ్, కుమార్, నర్సింహ, శ్రీను తదితరులు ఉన్నారు.

## గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం అభినందనీయం



మక్తమాదారంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్, జూన్ 16 : గ్రామాభివృద్ధిలో బీఆర్ఎస్ నాయకులు భాగస్వామ్యం కావడం అభినందనీయమని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మక్తమాదారంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తన సొంత నిధులతో నిర్మిస్తున్న, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.బీఆర్ఎస్ శ్రేణులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సులోచన, రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంజుల, మాజీ ఉప సర్పంచ్ గణేశ్‌గౌడ్, నాయకులు సాయిలు, చంద్రమౌళి, మహేందర్‌గౌడ్, జనీల్‌కుమార్, యాదగిరి, నాయకులు కృష్ణ, చందు, మల్లేశ్, నరేశ్, జంగయ్య, రాజేందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరిగూడలో తాగునీటి గోస

- గ్రామంలో మరమ్మతుకు చేరుకున్న రెండు బోర్లు
- సరఫరాకు నోచుకోని మిషన్ భగీరథ నీరు
- ట్యాంకర్ల వద్దకు స్థానికుల పరుగులు
- ఒక ఇంటికి రెండు బిందెల నీరు మాత్రమే అందజేత
- ఆందోళనలో గ్రామస్తులు
- అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వేడుకోలు



కుమ్మరిగూడలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

షాబాద్, జూన్ 16 : మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో ఉన్న రెండు బోర్లు కాలిపోయాయి. మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో తాగునీటి కోసం బిందెలు పట్టుకొని ప్రజలు ట్యాంకర్ల వద్దకు పరిగెత్తుతున్నారు. ఒక ఇంటికి రెండు బిందెలు చొప్పున నీటిని అందిస్తుండడంతో మాకు నీరు సరిపోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్ల బీఆర్ఎస్ హయంలో ఏనాడు కూడా ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడలేదని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు తాగునీటి బాధలు తప్పడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సరఫరా బోర్లకు వెంటనే మరమ్మత్తులు చేయించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



షాద్‌నగర్‌లోని నారాయణ పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

షాద్‌నగర్‌టౌన్, జూన్ 16 : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయిస్తున్న నారాయణ, మేధా పాఠశాలలను సోమవారం తనిఖీ చేసి పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, నోట్ బుక్స్ తదితర వస్తువులను తప్పకుండా కొనుగోలు చేయాలని పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు చెప్పడం సరి కాదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, వినయ్, అశోక్, తరుణ్, రాజు పాల్గొన్నారు.

## సీలింగ్ భూముల రైతులకు పాస్ బుక్కులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 16 : మండల పరిధిలోని అనాజ్‌పూర్ సర్వే నంబర్ 281లో సీలింగ్ భూమికి సంబంధించిన పట్టాలో రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చి పాసు బుక్కులు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏర్పుల నర్సింహ, నాయకులు వర్కాల ముత్యాలు, జంగయ్య, మహేశ్, కావలి రాములు, బాలరాజు, వింజమూరి రవీందర్, వెంకటేశ్, మల్లయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

## పాపిరెడ్డిగూడకు పారామెట్ నియామకం



పాపిరెడ్డిగూడలో పారామెట్ స్వప్నను సన్మానిస్తున్న రైతులు, గ్రామస్తులు

కేశంపేట, జూన్ 16 : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోని పశువైద్య ఉప కేంద్రానికి పూర్తిస్థాయి పారామెట్‌ను ప్రభుత్వం నియమించింది. గత కొన్నేండ్లుగా ఉప కేంద్రానికి పారామెట్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై స్పందించిన ప్రభుత్వం ఏప్రిల్ 15న పాపిరెడ్డిగూడ ఉప కేంద్రానికి పారామెట్‌ను నియమించింది. అయితే విధుల్లో చేరి నెల రోజులు తిరగకుండానే డిప్యూటేషన్‌పై షాద్‌నగర్‌కు కేటాయించారు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'పాడి రైతుల పరేషాన్' అనే శీర్షికన జూన్ 10న ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందిస్తూ పాపిరెడ్డిగూడకు పూర్తిస్థాయి పారామెట్‌ను నియమించినట్లు తెలిసింది. పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించిన పారామెట్ స్వప్నను సోమవారం గ్రామస్తులు ప్రత్యేకంగా సన్మానించారు. రైతులకు అండగా ఉండి సేవలు అందించాలని ఆకాంక్షించారు. రైతుల సమస్యలు వెలుగులోకి తీసుకొచ్చిన 'నమస్తే తెలంగాణ'కు రైతులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, భిక్షపతి, దాసయ్య, భీమయ్య, లక్ష్మయ్య, జంగయ్య, ధనమయ్య, రామకృష్ణ, రాఘవేందర్, సాయిలు, దాసు పాల్గొన్నారు.

## జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



మద్దూర్‌లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, జూన్ 16: జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మద్దూర్‌లో జీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలు పోషించుకుని జీవనం సాగించే రైతులకు మంచి ఆదాయం ఉంటుందని చెప్పారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోపి, విద్యాసాగర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చింతగుట్ట తండాలో కొనసాగుతున్న బడిబాట



చింతగుట్ట తండా ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్న విద్యార్థులు

కొత్తూరు, జూన్ 16 : మండల పరిధిలో బడిబాట కొనసాగుతున్నది. సోమవారం చింతగుట్ట తండాలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల్లో చదివే 20 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘుపాల్, గ్రామ పెద్దలు శేఖర్‌రెడ్డి, హరికృష్ణ, జనార్దనచారి, గణేశ్, మహేశ్, ఉపాధ్యాయులు ఫాతిమా, సునంద, అన్నపూర్ణ పాల్గొన్నారు.

**సొంత ఖర్చులతో స్కూల్ వ్యాన్**

సిద్దాపూర్‌కు చెందిన శేఖర్ రెడ్డి స్కూల్ విద్యార్థులు వెళ్లేందుకు సొంత ఖర్చులతో స్కూల్ వ్యాన్ ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు శేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### రివర్ వ్యాలి ఇంటర్నేషనల్ స్కూల్‌లో పిల్లలను చేర్పించవద్దు

పెద్దఅంబర్‌పేట, జూలై 16 : పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని గౌరెల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన రివర్ వ్యాలి ఇంటర్నేషనల్ పాఠశాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేదని అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాధికారి(ఎంఈఓ) జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించ వద్దని సూచించారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి సమస్యలను కొని తెచ్చుకోవద్దని తెలిపారు. రాబోయే రోజుల్లో వచ్చే సమస్యలకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తొందర పడకుండా తమ పిల్లల భవిష్యత్ కోసం ఆలోచించి సయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు, జూన్ 16 : మండల పరిధిలోని వీరన్నపేట్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చౌదరి గూడ విద్యుత్ ఏఈ సోమవారం తెలిపారు. చెట్ల నరికివేత కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు గణపురం, వీరన్నపేట, పెద్దఎలికిచెర్ల, గాలిగూడెం, జిల్లేడు, మెట్టుగడ్డ తండా, నంద్యాతాండ, వేపకుచ్చతండా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. రైతులు, వినియోగారులు సహకరించాలని కోరారు.

### విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

నందిగామ, జూన్ 16 : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం నందిగామ మండల పరిధిలోని నర్సాప్పగూడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నర్సప్పగూడ గ్రామానికి చెందిన కట్న నర్సింహ(58) ఇంట్లో నీటి సంపు మోటారు పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

యాచారం, జూన్ 16 : మండల పరిధిలోని మాల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ రూ. లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

చేవెళ్ల టౌన్, జూన్ 16 : ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగిస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే.రామస్వామి తెలిపారు. సోమవారం చేవెళ్లలో పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి అధ్యక్షతన మంగళవారం ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ హత్యాకాండను ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘా నాయకులు ప్రభు లింగం, సత్యనారాయణ, మంజుల, లలిత, శ్రీకాంత్, పెంటయ్య, నరసింహులు, యాదమ్మ, రామయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మాలలపై పక్షపాత వైఖరి వీడాలి



మాలల చైతన్య యాత్ర కరపత్రం ఆవిష్కరిస్తున్న మాల మాహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల రూరల్, జూన్ 16 : మాలల హక్కుల సాధన కోసం అలుపెరుగని ఉద్యమం చేస్తామని మాల మాహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. పల్లె పల్లెకు మాలల చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం శంకర్‌పల్లిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలపై పక్షపాత వైఖరిని వీడాలని, మాలలు రాజ్యాంగం ద్వారా పొందాల్సిన హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు మాలలపై దాడులు పెరుగుతున్నాయని, మరో వైపు విష ప్రచారం జరుగుతుందన్నారు. వారికి కల్పించాల్సిన హక్కులను న్యాయబద్దంగా పొందడానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మాలలంతా ఐక్యమై పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ బౌద్ధ, మాల మహానాడు శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు రాములు, అశోక్, శంకర్, నర్సింహులు, బాలన్న పాల్గొన్నారు.



రైతు నేస్తంలో భాగంగా జిల్లాలోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**- న్యూస్ నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా, జూన్ 16**



మండల పరిధిలోని శంకర్‌కొండ తండాలో పీఎం జన్మన్ పథకంలో రూ.60 లక్షలతో చేపట్టిన, మల్టీపర్పస్ గిరిజన భవనానికి సోమవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.

**- ఆమనగల్లు, జూన్ 16**

### సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉచిత సేవలు

చేవెళ్ల టౌన్, జూన్ 16 : సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి కేబుల్ వైర్, నెట్ సౌకర్యం ఉచితంగా కల్పించేందుకు దాతలు టెలికాం సేవల సంస్థ వైబ్ టెలికాం ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ నారాయణ యాదవ్, దామోదర్ యాదవ్, ముందుకు రావడం అభినందనీయమని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రముఖ టెలికాం సేవల సంస్థ వైబ్ టెలికామ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు చేవెళ్ల మున్సిపల్ కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కేబుల్ వైర్, నెట్టు కనెక్షన్ ఉచితంగా ఇవ్వనున్నారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.... సీసీ కెమెరాల ఏర్పాటుతో చేవెళ్ల ప్రాంతంలో నిఘా, కనెక్టివిటీ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కమ్మగూడలో పార్క్ స్థలం పరిశీలన



అను-మను ఎన్‌క్లేవ్‌లోని పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

తుర్కయాంజాల్, జూన్ 16 : మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ సర్వే నంబర్ 227, 228 అను-మను ఎన్ క్లేవ్‌లోని సుమారు 871 గజాల పార్కు స్థలాన్ని సోమవారం తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఇటీవల కొందరు వ్యక్తులు అను-మను ఎన్‌క్లేవ్‌కు చెందిన 871 గజాల పార్కు స్థలాన్ని బై నంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేసుకోని మున్సిపాలిటీలో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత శుక్రవారం పార్కు స్థలాన్ని చదును చేసి కబ్జా చేసే యత్నం చేయగా మున్సిపల్ సిబ్బంది పనులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అను-మను ఎన్‌క్లేవ్‌లోని పార్కు స్థలాన్ని సంరక్షిస్తామని తెలిపారు. కబ్జాకు యత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



చేవెళ్ల రూరల్ : దేవునిఎర్రవల్లి వార్డులో ప్రొసీడింగ్ అందజేస్తున్న చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య

చేవెళ్ల రూరల్, జూన్ 16 : గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్, దేవునిఎర్రవల్లి వార్డుల్లో తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ రాజేంద్ర, శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ, ఎల్వర్తి గ్రామాల్లో తహసీల్దార్ సురేందర్, నాయబ్ తహసీల్దార్ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామస్తుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని వాటిని అక్కడే పరిష్కరించి ప్రొసీడింగ్స్ అందజేశారు. మిగతా వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

**కడ్తాల్‌లో..**

**కడ్తాల్ :** మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ ముంతాజ్ అధ్యక్షన నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో అధికారులు భూసమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఏఎంసీ డైరెక్టర్ నరేశ్ నాయక్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు నర్సింహ, బీచ్యానాయక్, శంకర్, నాయకులు చందోజీ, సత్యంయాదవ్, మల్లేశ్‌గౌడ్, యాదయ్య, రామచందర్‌నాయక్, రామకృష్ణ, జగన్, కేశవులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**పోమాల్‌పల్లి, అల్వాలలో..**

**కేశంపేట :** ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కేశంపేట మండలంలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని పోమాల్‌పల్లి, అల్వాల గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సదస్సులకు పోమాల్‌పల్లి 20, అల్వాలలో 6దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఆజంఅలీ తెలిపారు. రైతుల దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో డీటీ గీత, ఆర్‌ఐలు చెన్నకేశవులు, నివేధిత, రెవెన్యూ సిబ్బంది మహేశ్, అనసూయ, శివ, తదితరులు పాల్గొన్నారు.

**ఆకుతోటపల్లిలో..**

**ఆమనగల్లు :** మండల పరిధిలోని ఆకుతోటపల్లిలో సోమవారం తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సులో భాగంగా ప్రజల నుండి 53 దరఖాస్తులను స్వీకరించిన్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రైతు శిక్షణ అధికారిణి శైలజ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, రెవెన్యూ అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**బొంగుళూరులో..**

**ఆదిబట్ల :** మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై 11 ఫిర్యాదులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముస్తాఫా, శ్రీరాములు, కంప్యూటర్ ఆపరేటర్ రమేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**బాకారం జాగీర్, శ్రీరాంనగర్‌లో..**

**మొయినాబాద్ :** మండల పరిధిలోని బాకారం జాగీర్, శ్రీరాంనగర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాకారం జాగీర్‌లో 47, శ్రీరాంనగర్‌లో 50 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అర్‌ఐలు రాజేశ్, రోజా, సిబ్బంది పాల్గొన్నారు.

### చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రజక సంఘం నేతలు

కేశంపేట, జూన్ 16 : మండల కేంద్రంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, వీరేశం, శ్రీధర్‌రెడ్డి, రూప్లానాయక్, కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్, నర్సింహ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డిగూడలో విద్యుత్‌లైన్ మార్పునకు శ్రీకారం



విద్యుల్ లైన్ మార్పుకోసం వచ్చిన సామగ్రిని చూయిస్తున్న గ్రామస్తులు

కేశంపేట, జూన్ 16 : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఇండ్ల పైనుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్‌లైన్ మార్పునకు ట్రాన్స్‌కో అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ లైన్ మార్పు కోసం సామగ్రి సోమవారం రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గత 25 ఏండ్లుగా ఇండ్ల పైనుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగల లైన్ కింద నివాసం ఉంటున్న ప్రజలు ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనన్న భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు విద్యుత్ లైన్ మార్పుకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. విద్యుత్ లైన్ మార్చుతుండడంతో గ్రామస్తులు ట్రాన్స్‌కో అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు సుందరయ్య, లక్ష్మీనారాయణ, నర్సింహులు, యాదయ్య, రాఘవేందర్, శేఖర్, పర్వతాలు, సుదర్శన్‌గౌడ్, దేవేందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.